www.kalamdaily.com
Follow on: Kalamtelugu

# కలం
ప్రజల గళం...

08-03-2026, ఆదివారం | పేజీలు: 3

360° SINGLE TOPIC
Sumathi - IPS

2026 ఫిబ్రవరి 24న మావోయిస్టు అగ్రనేత దేవ్ జీతో పాటు ఇతర నేతలు లొంగిపోయిన సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డితో ఎస్ఐబీ చీఫ్ సుమతి



## బ్రిలియంట్ ఐపీఎస్..

# సైలెంట్ ఆపరేషన్

**తెలంగాణలో మావోయిస్టులు లొంగిపోయినప్పడల్లా వేదికపై డీజీపీ శివధర్‌రెడ్డితో పాటు ఓ మహిళ కనిపిస్తూ ఉంటారు. పోలీస్ యూనిఫామ్‌లో కనిపించే ఐపీఎస్ ఆఫీసర్ల పక్కన చీర కట్టుకుని ఆమె చాలా సాదాసీదాగా కనిపిస్తారు. చూడడానికి సింపుల్‌గా ఉన్నా.. మావోయిస్టుల లొంగుబాట్ల వెనుక కీలక సూత్రధారి, వ్యూహకర్త, సైలెంట్ ఆపరేషన్ నిర్వహించే ఇంటెలిజెంట్. ఆమె ఎవరో కాదు.. రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ చీఫ్, ఐజీ సుమతి.**

**2001లో డీఎస్పీగా పోలీస్ సర్వీస్‌లో చేరిన సుమతి.. ఆ తర్వాత 9 ఏండ్లకే ఐపీఎస్‌గా ప్రమోషన్ పొందారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్రం అఫీషియల్‌గా ప్రకటించే సమయానికి ఎస్ఐబీ బాధ్యతల్లోకి వచ్చిన ఆమె.. ఎన్‌కౌంటర్లు, అరెస్టుల్లాంటివి లేకుండా భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయేలా సైలెంట్ ఆపరేషన్ నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సైతం తెలంగాణ ఎస్ఐబీని ప్రశంసించింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ఎస్ఐబీకి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఐపీఎస్ సుమతిపై కలం 360 డిగ్రీస్ స్పెషల్...**

తెలంగాణ బ్యూరో, కలం

మావోయిస్టుల సరెండర్ వెనుక ఐజీ సుమతి ప్రత్యేక వ్యూహం

ఆపరేషన్ కగార్‌లో ఆమె పాత్రపై ప్రశంసల వెల్లువ



> పోలీసులంటే యూనిఫామ్ వేసుకుని లాఠీలతో శాంతిభద్రతలను కంట్రోల్ చేయడం, నేరాలను నిలువరించడం మాత్రమే కాదు.. సమాజంలో మార్పు, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కూడా పోలీసుల బాధ్యతే.
> - సుమతి, ఐపీఎస్



2026 మార్చి 7న 130 మంది మావోయిస్టులు లొంగిపోయిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డితో డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి





## సరెండర్ల వెనుక ప్రత్యేక స్ట్రాటజీ

నిషేధిత మావోయిస్టు పార్టీని కంట్రోల్ చేసే క్రమంలో అడవుల్లో కూంబింగ్, తుపాకీ కాల్పులు, ఎన్‌కౌంటర్లు, అరెస్టులు రెగ్యులర్ ప్రాక్టీస్. ఆపరేషన్ కగార్‌లో చత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఇలాంటి వాటినే చూశాం. కానీ తెలంగాణలో మాత్రం అంతా సైలెంట్ ప్రాసెస్. దీని వెనుక యాక్టివ్ రోల్ ఐపీఎస్ సుమతిదే. యూనిఫామ్ ధరించకుండా, తుపాకీ పట్టకుండా, అడవుల్లోకి వెళ్లకుండా, కూంబింగ్ చేయకుండా, ఎన్‌కౌంటర్లకు తావు ఇవ్వకుండా పకడ్బందీ వ్యూహంతో ఇప్పటి వరకు 721 మంది మావోయిస్టులు లొంగిపోయేలా చేశారు. మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో మొదలు పీఎల్‌జీఏ సభ్యుల వరకు వివిధ స్థాయిల్లోని నేతలు తెలంగాణ పోలీసుల ముందు ఆయుధాలతో సహా లొంగిపోయారు. లైట్ మెషీన్ గన్ మొదలు ఏకే-47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, త్రీ నాట్ త్రీ రైఫిల్ వరకు దాదాపు 270 ఆయుధాలు ప్రభుత్వానికి అందాయి.

## సైకలాజికల్ వార్‌తో సుమతి సక్సెస్

మావోయిస్టులు లొంగిపోయేలా చేయడంలో సుమతి సైకలాజికల్ వార్ వ్యూహాన్ని ఎంచుకున్నారు. మావోయిస్టు పార్టీలోని తాజా పరిస్థితులను విశ్లేషించుకున్నారు. పార్టీ ఒకవైపు నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ ఉండడం.. మరోవైపు పోలీసు బలగాల నిరంతర దాడులతో వారిలో ఆందోళన నెలకొనడం.. ఇంకోవైపు అడవిలోకి నిత్యావసరాలు, మందులు సమకూర్చుకోవడంలో లాజిస్టిక్ సమస్యలు ఎదురుకావడం.. ఈ మూడింటిపై ఆమె దృష్టి పెట్టారు. దీనికి తగినట్లుగా సైకలాజికల్ స్ట్రాటజీని రూపొందించారు. మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోతే 'అమరులు' అవుతారు... అరెస్టయితే ప్రజల్లో 'హీరో' అవుతారు... లొంగిపోతే ప్రజల్లో సానుభూతి తగ్గుతుంది.. ఇవీ ఆమె ఎంచుకున్న మార్గం. ఎంత ఎక్కువ మంది లొంగిపోతే మావోయిస్టు కేడర్‌పై అంత ఎక్కువ ఒత్తిడి పెరుగుతుందని, మానసికంగా వీక్ అవుతారని అంచనా వేసి సరెండర్ల కోసం యాక్షన్ ప్లాన్ వర్కవుట్ చేశారు.

## డాక్టర్ కావాలనుకొని పోలీసాఫీసర్..

ఐపీఎస్ బడుగుల సుమతిది గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కలుగోట్ల. వ్యవసాయ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్, నల్సార్ యూనివర్సిటీలో సెక్యూరిటీ అండ్ డిఫెన్స్ లాలో పీజీ చేశారు. సుమతి తండ్రి తిరుపతి రెడ్డి కలుగోట్ల గ్రామ సర్పంచ్‌గా పదిసార్లు ఎన్నికయ్యారు. ఆ టైమ్‌లో ప్రజలంతా సమస్యల పరిష్కారం కోసం తరచూ ఇంటికి వచ్చేవారు. ప్రజాసమస్యలపై ఆనాడే సుమతికి అవగాహన ఏర్పడింది. మరోవైపు 'నువ్వు ఎప్పటికైనా పోలీసాఫీసర్ కావాలి' అంటూ నాయనమ్మ చెబుతూ ఉండేది. తనకు డాక్టర్ కావాలనే కోరిక ఉన్నప్పటికీ, అది నెరవేరకపోవడంతో.. గ్రూప్ 1, సివిల్స్ పరీక్షలపై సుమతి ఫోకస్ పెట్టారు. 2001లో సివిల్స్ రాయగా రాలేదు. అదే ఏడాది గ్రూప్ 1కు సెలెక్ట్ అయి డీఎస్పీ ఉద్యోగం సంపాదించారు.

- సుమతి 2010లో ఐపీఎస్‌గా ప్రమోషన్ పొందారు. ఆమెకు 2006 బ్యాచ్ కేటాయించారు.
- తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ హయాంలో 2020లో డీఐజీగా పదోన్నతి లభించింది. షీటీమ్స్ ఇన్‌చార్జ్‌గా సేవలందించారు.
- 2024లో ఐజీగా ప్రమోషన్ పొందారు. ప్రస్తుతం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) చీఫ్‌గా ఉన్నారు.





తండ్రి తిరుపతి రెడ్డితో సుమతి




### స్ట్రాటజీ ఎలా అమలైంది?

మూడు అంచెల్లో ఇంటెలిజెన్స్ విభాగాన్ని సుమతి పని చేయించారు. మావోయిస్టులు లొంగిపోయేలా వారి కుటుంబ సభ్యుల ద్వారా సంప్రదింపులు జరిపారు. మాజీ మావోయిస్టులను మీడియేషన్ కోసం వాడుకున్నారు. దళాల్లోని కేడర్‌తో సీక్రెట్‌గా రాయబారం నడిపారు. సుదీర్ఘంగా ఆలోచించి ఈ వ్యూహాన్ని సక్సెస్ చేసేందుకు తగిన నెగోషియేషన్, కమ్యూనికేషన్ నెట్‌వర్క్ మెకానిజాన్ని రూపొందించుకున్నారు. మూడో కంటికి తెలియకుండా ఆపరేషన్‌ను సైలెంట్‌గా నడిపించారు. సాధారణంగా ఇంటెలిజెన్స్ నిఘా వర్గాలతో వచ్చే సమాచారంతో అరెస్టులు జరిగేవి. దళాల కదలికతో కూంబింగ్ ఆపరేషన్లు జరిగేవి.. ఎన్‌కౌంటర్లు చేయాల్సి వచ్చేది. కానీ సుమతి డిఫరెంట్ ఆలోచనతో హింసాత్మక ఘటనలు జరగలేదు. మావోయిస్టులు వాళ్లంతటవాళ్లే లొంగిపోయేందుకు సిద్ధం కావాల్సి వచ్చింది. అది ఆ పార్టీ కేడర్ మానసికంగా కుంగిపోయేందుకు దారితీసింది.

### మావోయిస్టుల్లో విశ్వాసం ఎందుకు పెరిగింది?

మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో చనిపోతే 'అమరులు'గా ప్రజల్లో వారిపై గౌరవం, సానుభూతి పెరుగుతుందనే ఉద్దేశంతో సరెండర్ అయితే చిన్నచూపు ఏర్పడుతుందని సుమతి గ్రహించారు. వీలైనంత వరకు సరెండర్ అయ్యేలా డ్రైవ్ చేయడమే ఉత్తమమనే అంచనాకు వచ్చారు. దీంతో అటు ఉద్యమానికి ప్రచారం తగ్గడంతో పాటు ప్రజల నుంచి వ్యతిరేకత రాదని భావించారు. 'అమరులు' అనే భావన స్థానంలో 'జనజీవన స్రవంతి' కోసం యాక్షన్ ప్లాన్ రూపొందించారు. లొంగిపోతే కేసులన్నింటినీ ఎత్తివేయడంపై పాజిటివ్ దృక్పథం.. ప్రాణహాని ఉండదనే భరోసా... పునరావాసంలో భాగంగా ఇంటి వసతి... అనారోగ్య సమస్యలకు వైద్య సౌకర్యం... మామూలు జీవితం గడిపేలా ఉపాధి మార్గం... రివార్డు మొత్తాన్ని అందించడం.. లాంటి చర్యలతో ఇటు కుటుంబ సభ్యుల ద్వారా, అటు మీడియేటర్ల ద్వారా మావోయిస్టుల్లో కాన్ఫిడెన్స్ కలిగించగలిగారు. దీంతో సరెండర్లు పెరిగాయి.

## మావోయిస్టు ఉద్యమం బలహీనం..

ఎన్‌కౌంటర్లు జరిగితే సాధారణ దళ సభ్యుల్లో భయాందోళనలు మాత్రమే ఉంటాయి. కానీ లొంగిపోతే కేడర్ మానసికంగానే వీక్ అవుతుంది. దీంతో పార్టీ నిర్మాణమే బలహీనమవుతుంది. ఇప్పటికే ఆయుధాల కొరత, నిరంతరం పోలీస్ బలగాల కూంబింగ్, సరుకు రవాణాలో ఇబ్బందులు, దళాల కదలికలు పరిమితం కావడం.. కొత్త రిక్రూట్‌మెంట్‌లు లేకపోవడం.. లీడర్లకు అనారోగ్య సమస్యలు.. ఇలాంటి అంశాలను బేరీజు వేసుకుని తెలంగాణ సరిహద్దుల్లో ఇంటెలిజెన్స్ విభాగం యాక్టివ్ అయింది. అందుబాటులో ఉన్న టెక్నాలజీతో దళాల మూవ్‌మెంట్స్‌ను పసిగట్టి, వారి మొబైల్ నెట్‌వర్క్ పై నిఘా పెంచింది. పొరుగు రాష్ట్రాల్లో నేతలు ఎన్‌కౌంటర్లలో చనిపోతుండడం.. పార్టీలో సైద్ధాంతిక విభేదాలు తలెత్తడం.. తెలంగాణలో సరెండర్‌లు పెరుగుతుండడం.. ఇలాంటివి పార్టీని మానసికంగా కుంగదీశాయి. దీంతో రాష్ట కమిటీయే లేకుండాపోయింది.

